క్లుప్తంగా

ఇదీ తాగునీటి పాదుపు..!



వృథాగా పోతున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీఎస్ పురం పంచాయతీ వేణుగోపాలపురంలో కొళాయిలు మరమ్మతులకు గురికావడంతో తాగు నీరు వృథాగా పోతుంది. దీంతో నీరు చాలక దళితులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వ్యవసాయబోర్లు, బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోల్సిన దుస్థితి నెలకొంది. కొళాయిలకు మరమ్మతులు చేపట్టాలని కార్యదర్శికి విన్నవిస్తున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం మాట్లాడుతూ తెలుగు తిథులు, ఆంగ్ల తేదీలతో ఉన్న ఆచార్య ప్రభోదానంద స్వామి రచించిన ఈ క్యాలెండర్ బాగా ఉపయుక్తం అవుతుందని తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నమో నారసింహా..



బంగారు గరుడ వాహనంపై శ్రీవారు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 9 గంటలకు శ్రీవారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాన్ని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణతో కోన మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం, స్వామి అమ్మవార్ల కల్యాణం చేపట్టారు. నూతన సంవత్సరం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు కోనకు చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే రాపూరులోని రాపూరమ్మ, పర్వతవర్ధిని రామనాథేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, మద్దెలమడుగులోని కృష్ణమందిరం, అయ్యప్పమహావిష్ణు ఆలయాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మల్లాంలో ఉగాది శోభాయాత్ర



సకల దేవతామూర్తుల గ్రామోత్సవం

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని మల్లాంలో వెలసియున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని సకల దేవతామూర్తులకు వాహన సేవ, గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. ఆలయ చైర్మన్ సాయి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని 9 దేవతామూర్తులకు ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగరంగ వైభవంగా అలంకరించి ట్రాక్టర్లపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు.

వినాయకుని సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి దర్శనం కల్పించి, వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశులు, ఆర్డీఓ చిన్నయ్య, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రోధి.. కాంతులు విరియాలి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారు జాము నుంచి ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయం, ఆలయ పరిసరాలు పుష్ప, విద్యుద్దీపాలంకరణలు భక్తులు కట్టిపడేశాయి. తెట్టులో ప్రసిద్ధ శ్రీనల్లగంగమ్మ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దాతలు సమర్పించిన రూ.22లక్షల విలువైన కిరీటం, చీరతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. దేవస్థానం చైర్మన్ కంఠా రమేష్, వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, సభ్యులు నారాయణ, ప్రదీప్, అనిల్, దిలీప్, రాజేంద్ర, యాదగిరి, పూజారి శంకరయ్య, గుణ తదితరులు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో

నాగలాపురం: మండలంలోని సురుటపల్లెలోని ప్రసిద్ధ ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం తెలుగు సంవత్సరాది(ఉగాది) వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీమరగదాంబిక అమ్మవారికి, శ్రీవాల్మీకీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తదుపరి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై అలంకరించి ఆలయ ఆవరణలో కొలువుదీర్చి పంచాంగ శ్రవణం చేశారు. తిరుపతి నుంచి వచ్చిన తిలకంబట్టు కుమార్ ఆచార్యులు క్రోధి నామ సంవత్సర శుభ శుభ ఫలితాలపై పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రా రెడ్డి ప్రధాన అర్చకులు కార్తికేశన్, రుద్రమూర్తి బృందం పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని స్థానిక శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి, వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణం చేశారు. మండలంలోని పల్లమాల శ్రీఅభయ అంజనేయస్వామి దేవాలయం, వేమలమ్మ, చెంగాళమ్మ, వినాయకుడు, పచ్చాలమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: మండలంలో మంగళవారం ఉగాది సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక శ్రీ మలయ పెరుమాళ్ ఆలయం వద్ద శ్రీద్రౌపతమ్మ పండరి భజన బృందం నిర్వహించిన చిన్నారుల కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. అనంతరం 7 గంటలకు కీళపూడిలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన భజన బృందం కోలాట ప్రదర్శన భక్తి భావంలో ముంచెత్తింది. గురువులు లోకేష్, శివ కుమార్, తులసి, శ్రీవాణి, మణికంఠన్ పర్యవేక్షించారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాదిని వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు సర్కారు అభిషేకాన్ని నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం శుద్ధి, తోమాల తదితర కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు ఆస్థాన మండపంలో పెద్దశేష వాహనంపై ఉత్సవమూర్తులను అధిష్టింపచేసి, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించారు. టీటీడీ తరపున ఆలయ అధికారులు సమర్పించిన పట్టు వస్త్రాలను అర్చకులు ఉత్సవ మూర్తులకు సమర్పించారు. ఆస్థానం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం వేదపండితులు ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి అక్షింతలను అందజేశారు. కార్యక్రమాలను ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీకాళహస్తి : పురవీధుల్లో నల్లగంగమ్మ ఊరేగింపు



శ్రీకాళహస్తి: వెండి కిరీటంలో నల్లగంగమ్మ దేవత



శ్రీకాళహస్తి: ముఖద్వారంలో పుష్పాలంకరణ







నాగలాపురం: పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో, నారాయణవనం : ఉగాది ఆస్థానం, బీఎన్‌కండ్రిగ : వేంకటేశ్వరస్వామి ఆలయంలో, విశేషాలంకరణలో పచ్చాలమ్మ దేవత, పిచ్చాటూరు: కీళపూడిలో కోలాటం

నేటి నుంచి ప్రజా ఆశీర్వాద పాదయాత్ర

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా బుధవారం నుంచి వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి మంగళవారం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆశీస్సులతో బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించారన్నారు. అప్పటి నుంచి నిత్యం ప్రజల్లో ఉంటున్నారని తెలిపారు. 30 ఏళ్ల బొజ్జల కుటుంబ పాలనలో సాధ్యం కాని అభివృద్ధిని నాలుగున్నర ఏళ్లలో చేసి చూపించారని చెప్పారు. ఈసారి గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. తాను లోకల్ అంటూ ప్రజా సమస్యలు పరిష్కరించారని, నేడు ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు మరో అడుగు వేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 4గంటలకు 1 నుంచి 5వ వార్డు వరకు ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొంటారని. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



పంటకు తగులుతున్న వైర్లు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడులో రైతులు సాంబశివయ్య, సురేష్, నాగూరయ్య, మాధవి పొలాల వద్ద విద్యుత్ వైర్లతో ప్రమాదం పొంచి ఉంది. వైర్లు కిందకు వేలాడుతుండడంతో రైతులు పొలంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పొలాన్ని దుక్కి దున్నలేక పోతున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో పంటలు కాలిపోయి ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వైర్లు సరిచేయాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

భక్తుడికి భక్తవత్సలుని సారె



సారె తీసుకెళుతున్న అంజూరు శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి: పట్టణంలోని తేరువీధిలో వెలసిన శ్రీభక్తకన్నప్ప ఆలయ 44వ వార్షికోత్సవం, ఉగాదిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తకన్నప్ప ఆలయంలో అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



భక్తకన్నప్పకు పూజలు

తలకోనకు పోటెత్తిన భక్తజనం

భాకరాపేట : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తలకోనకు మంగళవారం ఉదయానికే పెద్దఎత్తున భక్తులు చేరుకున్నారు. తెల్లవారుజామున శ్రీ సిద్ధేశ్వరి సమేత శ్రీసిద్ధేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ పూర్తి చేసిన తరువాత భక్తులకు సర్వదర్శనం కల్పించారు. తలకోనలోని పుణ్యతీర్థం అయిన (శిరోద్రోణం) ఝరిలో స్నానాలు ఆచరించి శ్రీ సిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రస్టు బోర్డు చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఈఓ జయకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు, ఎంపీపీ రెడ్డెమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చెంగల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కండలేరులో 7.879 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 7.879 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని మడిబాక పంచాయతీ రాజులకండ్రిగకు చెందిన 20 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం శ్రీకాళహస్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఏర్పేడు మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన రామకృష్ణమరాజు, ఉదయ్‌కుమార్ రాజు, మరో 20 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి పార్టీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంగల్ రాజు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, నాయకులు మణి రాజు, సురేష్, ఎర్రమ రాజు, రాజుల పాలెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభ సూచికం క్రోధి నామం..

శ్రీకాళహస్తి: శుభ సూచకం క్రోధి నామ సంవత్సరం అని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో స్వామివారి సన్నిధి వద్ద పంచాంగ పఠనం జరిగింది. ద్వాదశ రాశుల వారి ఫలాలను సిద్ధాంతి వివరించారు. క్రోధం అంటే అసురలపై భగవంతుడికి క్రోధం అని అర్థమన్నారు. దైవాన్ని నమ్ముకుని రాశులకు సంబంధించి పరిహారం చేసుకుంటే శుభాలు జరుగుతాయన్నారు. వర్షాలు తక్కువ పడుతాయన్నారు. అలాగే ఆలయ ఊంజల్‌సేవా మండపం వద్ద మంగళవారం రాత్రి ప్రముఖ అవధాని మేడసాని మోహన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఆహూతులను ఉత్తేజపరిచింది. మేడసాని మోహన్ మాట్లాడుతూ క్రోధినామ పేరు వినేందుకు నెగిటివ్‌గా ఉన్నప్పటికీ ఈ సంవత్సరంలో రాశులపై అంత దుష్ట ప్రభావం ఏమి చూపడం లేదన్నారు. శ్రీకాళహస్తిలో పుట్టినవారికి దక్షిణామూర్తి, జ్ఞానాంబ, శివయ్య అనుగ్రహంతో ఏ కష్టాలైన ఎదుర్కోగలుగుతారని తెలిపారు. కవులందరూ తమ కవిత్వాలను, భావాలను వినిపించి ఉత్తేజితులనుచేశారు. పలువురు సాహితీప్రియులు హాజరయ్యారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పా ల్గొన్నారు.

స్వామి,అమ్మవార్ల పురవిహారం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి పురవిహారం చేశారు. తొలుత ఆలయంలోని అలంకారం మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులుకు వివిధర కాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి స్వామివారి సన్నిధి వద్ద విశేష పూజలు నిర్వహించారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శ్రీస్వామి,అమ్మవార్లు పురవిహారం చేశారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.




పంచాంగ శ్రవణం చేస్తున్న ఆలయ సిద్ధాంతి కరణం లక్ష్మీనారాయణశర్మ, స్వామి,అమ్మవార్ల ఊరేగింపు



కవి సమ్మేళనంలో మేడసాని మోహన్, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, సాహితీ వేత్తలు

- ఇరుగ్రామాల మధ్య ఘర్షణ
- కేవీబీపురంలో ఉద్రిక్తత

కారు అతివేగం తెచ్చిన తంటా

కేవీబీపురం(వరదయ్యపాళెం): ద్విచక్ర వాహనదారులను ఓవర్‌టేక్ చేసేందుకు కారును అతి వేగంగా నడపడం రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఇరు వర్గాలపై కేసులు నమోదైన ఘటన కేవీబీపురంలో మంగళవారం చోటు చేసుకుంది. పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ కథనం మేరకు.. మండలంలోని పెరిందేశం గ్రామానికి చెందిన శ్రీకాంత్, శంకర్, తిరుపతి ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం కేవీబీపురం సంతకు వెళ్తున్నారు. అదే సమయంలో కేవీబీపురానికి చెందిన పి.భాస్కర్ కారులో అటువైపుగా వేగంగా ద్విచక్ర వాహనాన్ని దాటుకుని వెళ్లి ముందుకు ఆగాడు. దీనిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారు కారు నడిపిన భాస్కర్‌ను అతివేగంపై ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదన జరిగింది. ఈ విషయం అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌కు చేరడంతో ఇద్దరిని మందలించారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వి.భాస్కర్, అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అలాగే పెరిందేశంకు చెందిన శ్రీకాంత్, అతని అనుచరులపై మరో కేసు నమోదైంది. అంతటితో ఆగకుండా మంగళవారం ఉదయం పెరిందేశంకు చెందిన గ్రామస్తులు దాదాపుగా 200 మందికి పైగా కేవీబీపురం చేరుకుని పోలీసులు తమకు సరైన న్యాయం చేయలేదని, వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో భాస్కర్ వర్గీయులకు, పెరిందేశంకు చెందిన శ్రీకాంత్ వర్గీయులకు మరోమారు వివాదం తలెత్తింది. దీంతో కేవీబీపురంలోని వి.భాస్కర్‌కు చెందిన దుకాణదారులపై దౌర్జన్యం చేసి వస్తు సామగ్రిని మూకుమ్మడిగా ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున వివాదం చెలరేగింది. సమాచారం అందుకున్న పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్, సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని ఇరువర్గాలతో చర్చలు జరిపి వివాదాన్ని ఆపారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను చేపట్టామని సీఐ తెలిపారు.



పోలీసులతో పెరిందేశం యువకుల వాగ్వివాదం

ముందస్తు చర్యల్లో పోలీసులు విఫలం

ఇరువర్గాల మధ్య వివాదం జరిగిన సమయంలో కేవీబీపురం ఎస్ఐ పోలీస్ స్టేషన్‌లో లేకపోవడం, ఉన్న అరకొర సిబ్బంది ఇరువర్గాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారు. సోమవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య జరిగిన వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి భద్రతా బలగాలను స్టేషన్‌లో అందుబాటులో ఉంచి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదని స్థానికులు చర్చించుకుంటున్నారు. రెండు వర్గాలను ముందస్తుగా నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తగు చర్యలు తీసుకుని శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని ఇరు గ్రామాల వాసులు కోరుతున్నారు.